# మల్లిగాడు - ఉల్లిపాయ

**భోజనం వంక ఒకసారి తీక్షణంగా చూసి మల్లిగాడు 'ఏమిటే మల్లీ! పతిరోజూ కోడిగుడ్డు చారు ఏంటి. నాకిష్టమైన ఉల్లిగడ్డ కారం ఏది?' అని అడిగాడు. దానికి మల్లి సమాధానమిస్తూ 'ఏం చెప్పమంటావయ్యా! ఉల్లి అడిగితే షావుకారీ ధర పెరింగిందని అంటున్నాడు. కిలో ముప్పై రూపాయలట! మీరు కొనరు పొమ్మంటున్నాడు. కోడిగుడ్డు ఇస్తాను తీసుకెళ్ళు అంటున్నాడు. ఇదేంటి దీని ధర ఎక్కువ కాదా? అంటే ఇదే తక్కువ ధర అని ఇస్తున్నాడు. అందుకే కోడిగుడ్డు రోజూ పెడుతున్నా మావా!' అంటూ బుజ్జగిస్తూ చెప్పింది మల్లి.**

కోడి కూసింది. మల్లిగాడు మెల్ల మెల్లగా ఒళ్ళు విరుచుకుంటూ కళ్ళు తెరుస్తున్నాడు. పక్కనున్న మల్లిని నిద్రలేపాడు. పండ్లపుల్లను నోట్లో వేసుకుని మల్లిని సద్ది కట్టమని చెప్పి తలపాగా, చేతికర్ర పట్టుకొని కొట్టం లోకి పోయాడు. గొర్రెలు కూడా మల్లిగాడ్ని చూడగానే 'గుడ్‌మార్నింగ్' చెప్తున్నట్లు అరవడం మొదలెట్టాయి. ఒక్కొక్క గొర్రెను ముద్దాడుతూ, నిమురుతూ గొర్రెలన్నింటినీ పరామర్శించాడు మల్లిగాడు. కొట్టం గడియ



తీయగానే ఒక్కొక్క గొర్రె ఆ గదిలో నుండి గంతులు వేసుకుంటూ సంతోషంగా బయటకొచ్చాయి. ఇంతలో మల్లి సద్దిమూట పట్టుకుని ఎదురుగా వచ్చింది. మల్లిగాడు సద్ది తీసుకుని గొర్రెల్ని తోలుకుంటూ రోజువారీగానే గుట్టల్లోకి వెళ్ళాడు.

ఆ గుట్టలను, ఈ గొర్రెలను చూసుకుంటూ మల్లిగాడు ఏవో కూనిరాగాలు తీస్తున్నాడు. ఒక్కొక్క గొర్రె గుట్టలు ఎక్కటం, మరో గొర్రెతో పోట్లాడుకోవడం చూస్తుంటే మల్లిగాడికి తెగ సంతోషమేస్తుంది. ఒకప్పుడు తన దగ్గర కేవలం అయిదు గొర్రెలు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం అవి 150వరకు ఉన్నాయి. ఎవరైనా మంచి సేట్ దొరికితే, మంచి ధర పలికితే కొన్ని గొర్రెల్ని అమ్మాలని అనుకుంటున్నాడు మల్లిగాడు. లేదా తానే ఒకరోజు పట్నం వెళ్ళి గొర్రెలు అమ్మాలని ఆలోచిస్తూ కూర్చున్నాడు. పట్నమనగానే మల్లిగాడికి అందమైన లోకంలా కనిపించింది. రోడ్లపై తిరిగే మోటార్లు, కార్లు, స్కూటర్లు చూస్తుంటే మల్లిగాడికి ఆనందం అనిపిస్తుంది. అంతేగాకుండా, తాను అప్పుడప్పుడు పట్నం వెళ్ళినప్పుడల్లా ఎన్టీఆర్ సినిమానో, చిరంజీవి సినిమానో చూస్తుంటారు. తాను చూసిన విషయాలని మల్లికి, తన స్నేహితులైన మరికొందరు గొర్రెల కాపరులకు చెప్తూ సంతోషపడుతుంటాడు, వారిని సంతోషపెడుతుంటాడు. పట్నం పోయేటప్పుడు తనను తప్పకుండా తీసుకొనిపొమ్మని మల్లి ఎన్నోసార్లు అనేది. మారాం చేసేది. ఈసారి ఎలాగైనా మల్లిని తప్పకుండా పట్నం తీసుకపోతానని మల్లిగాడు తనలో తానే గొణుక్కున్నాడు. పొద్దు తలమీదకి రావడంతో మల్లిపైకి ధ్యాస మళ్ళింది. అలాగే, కడుపులో ఆకలిగా వుంటే మల్లి ఇచ్చిన సద్ది వంక చూశాడు. సద్ది జ్ఞాపకంరాగానే మల్లిగాడికి నోట్లో నీళ్ళూరాయి. ఈరోజు మల్లి సద్ది ఏం కట్టిందోనంటూ ఆలోచన మొదలెట్టాడు. పక్కనేవున్న వ్యవసాయ బావి దగ్గరకు వెళ్ళి చేతులు, కాళ్ళు కడుక్కుని మల్లిగాడు సద్ది విప్పాడు. సద్ది విప్పి చూడగానే మల్లిగాడికి మళ్ళీ నిరాశే ఎదురయ్యింది. గత కొన్ని రోజులనుండి మల్లిగాడి సద్దిలో మార్పొచ్చింది. ఈమధ్యన మల్లి ప్రతిరోజూ కోడిగుడ్డు పులుసుతోనే సద్దిని కడుతున్నది. ఇదేందబ్బా అంటూ మల్లిగాడు దీర్ఘాలోచనలో పడ్డాడు. అటూ, ఇటూ చూసుకుంటూ సద్ది తిన్నాననిపించాడు. మళ్ళీ కొండలు, గుట్టలు పైకి ఎక్కడం, గొర్రెలను చూసుకోవడంలో మునిగిపోయాడు మల్లిగాడు. ఎలాగైనా ఈ సద్ది గురించి మల్లిని అడగాల్సిందే, తనకిష్టమైన ఉల్లిపాయ కారం ఎందుకు పెట్టడం లేదో తెలుసుకోవాల్సిందేనని అనుకున్నాడు. పొద్దువాలిపోయింది. మల్లిగాడు కొండ దిగుతూ గొర్రెలనన్నింటినీ పిలుస్తూ ఇంటిదారి పట్టాడు. గుట్టలవెంట, చెట్లవెంట పోయిన గొర్రెలు మల్లిగాడి పిలుపుతో ఒక్కొక్కటి మల్లిగాడిని అనుసరిస్తూ ఇంటిదారి పట్టాయి. ఇల్లు చేరాక గొర్రెలను కొట్టంలో కట్టేసి కాళ్ళూ, చేతులూ కడుక్కొని మల్లిని భోజనం పెట్టమని అన్నాడు. మల్లి వేడివేడి అన్నం తీసుకొచ్చింది. కోడిగుడ్డు చారు పోసింది. మళ్ళీ మల్లిగాడికి ఆలోచన మొదలైంది. భోజనం వంక ఒకసారి తీక్షణంగా చూసి మల్లిగాడు 'ఏమిటే మల్లీ! పతిరోజూ కోడిగుడ్డు చారు ఏంటి. నాకిష్టమైన ఉల్లిగడ్డ కారం ఏది?' అని అడిగాడు. దానికి మల్లి సమాధానమిస్తూ 'ఏం చెప్పమంటావయ్యా! ఉల్లి అడిగితే షావుకారీ ధర పెరింగిందని అంటున్నాడు. కిలో ముప్పై రూపాయలట! మీరు కొనరు పొమ్మంటున్నాడు. కోడిగుడ్డు ఇస్తాను తీసుకెళ్ళు అంటున్నాడు. ఇదేంటి దీని ధర ఎక్కువ కాదా? అంటే ఇదే తక్కువ ధర అని ఇస్తున్నాడు. అందుకే కోడిగుడ్డు రోజూ పెడుతున్నా మావా!' అంటూ బుజ్జగిస్తూ చెప్పింది మల్లి.

'నీయవ్వ! ఏం దునియానో ఏమో! గా మల్లారెడ్డి ఇంటికిపోయి ఓ రెండు ఉల్లిగడ్డలు అడుక్కొస్తాను...' అంటూ మల్లిగాడు అన్నాడు. ఎన్టీఆర్ ఉన్నప్పుడు రెండు రూపాయలకు కిలో బియ్యమిచ్చిండ్రు. మన గట్క (మొక్కజొన్న అన్నం) కే దిక్కులేకుండా చేసిండు. వరి అన్నం తినడం మొదలయింది. అప్పుడు గట్క పొద్దున్న తింటే మళ్ళా రాత్రిదాకా ఆకలయ్యేది కాదు. వరి అన్నం తిన్న దగ్గర్నుంచి కాళ్ళ నొప్పులు, కీళ్ళ నొప్పులు, ఏవేవో నొప్పులు. మన గట్కనే మంచిగుండే. మళ్ళీ ఈ ఉల్లిగడ్డ కూడా లేకుండా చేస్తారా ఏంది? నాకు ఉల్లిగడ్డ కారమే పెట్టవే మల్లి!



అంటూ భోజనం ముగించాడు.

మల్లిగాడు ఇంట్లోంచి బయటకొచ్చాడు. చుట్టుపక్కలవాళ్ళతో కబుర్లలోపడ్డాడు. వారితో కలిసి పటేల్ మల్లారెడ్డి ఇంటికి వెళ్దాం పద! అంటూ బయలుదేరారు. అక్కడ ఏవేవో విషయాలపై పిచ్చాపాటి కబుర్లలో మునిగిపోయారు. అంతా అయ్యాక మల్లారెడ్డి పటేల్‌ను 'పటేలా! ఉల్లికారం తిని చాలా రోజులైంది. రెండు ఉల్లిగడ్డలు ఇవ్వవా?' అంటూ మల్లిగాడు అడిగాడు. 'ఉల్లి బంగారమైందిరా' అంటూ ఉల్లి కథనంతా మల్లారెడ్డి పటేల్ మల్లిగాడికి చెప్పాడు. కథంతా విన్నాక ఇక! ఈ జన్మలో ఉల్లికారం తనకు దక్కదనుకొని మల్లిని గుర్తు చేసుకుంటూ మల్లిగాడు ఇంటి దారి పట్టాడు.

-ఎస్.వి. రమణాచారి